# పచ్చని తెలంగాణను చూసి ఓర్వలేని కాంగ్రెస్

- 24 గంటల కరెంట్ సరఫరాపై అనుచిత వ్యాఖ్యలు
- మూడు గంటలు ఎట్ల సరిపోతుందో టీపీసీసీ చీఫ్ రేవంతే చెప్పాలి
- మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు
- లక్షెట్టిపేట, గుడిపేట, గూడెం రైతువేదికల్లో రైతులతో చర్చా వేదిక

లక్షెట్టిపేట, జూలై 20 : పచ్చని తెలంగాణ రాష్ట్రాన్ని చూసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓర్వలేకపోతున్నారని, వాళ్లకు తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉన్నదని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలంటూ రైతులపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై నిరసనగా లక్షెట్టిపేట రైతు వేదికలో గురువారం రైతులతో కలిసి ఎమ్మెల్యే చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరెంట్ సరఫరాపై అనవసర వ్యాఖ్యలుచేస్తున్న రేవంత్ రెడ్డికి అసలు వ్యవసాయం గురించి ఇంచు మాత్రమైనా తెలుసా అని ప్రశ్నించారు. రైతుల కోసం ప్రాణాలర్పించే సీఎం కేసీఆర్ ఉండగా రైతుల జోలికి ఎవరూ రాలేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో పడ్డ కష్టాలను ఒక్కసారి గుర్తుచేసుకోవాలని రైతులకు సూచించారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండూ మూడుపూటలు కడుపు నిండా తిని, మూడు పంటలు పండించుకుంటే కాంగ్రెస్ నాయకుల కండ్లు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంత కాలం రైతులు రారాజుల్లా బతుకుతారని భరోసా కల్పించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకుల వైఖరి, రేవంత్ వాఖ్యలపై మండిపడుతూ రైతు వేదిక ఎదుట నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, రైతు బంధు సమితి అధ్యక్షుడు నడిమెట్ల రాజన్న, పార్టీ పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్లు చాతరాజు రాజన్న, సురేశ్ నాయక్, మెట్టు కల్యాణిరాజు, సొసైటీ చైర్మన్ గోళ్ల కాంతయ్య, వైస్ చైర్మన్ కాసు సురేశ్, నాయకులు చుంచు తిరుపతి, దొంత నర్సయ్య, గోల్కొండ సత్తయ్య, పెట్టెం తిరుపతి, దొంత నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.


హాజీపూర్ : గుడిపేట రైతువేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

## రైతు సంక్షేమమే ధ్యేయం..

హాజీపూర్, జూలై 20 : రైతు సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. మండలంలోని గుడిపేట రైతు వేదికలో నిర్వహించిన చర్చా వేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంట్, ఎరువులు, విత్తనాల కోసం దుకాణాల ఎదుట చెప్పులను వరుసలో పెట్టేవారని పేర్కొన్నారు. వ్యవసాయానికి మూడు దఫాలుగా విద్యుత్ ఇచ్చేవారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటైన తొమ్మిది నెలల్లోనే వ్యవసాయానికి 24 గంటల పాటు నిరంతర విద్యుత్ అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. అది ఓర్వలేకనే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తే ఏ మూలకు సరిపోతుందని ఆయనను ప్రశ్నించారు. అవగాహన లేనివారే ఇలా మాట్లాడుతారని విమర్శించారు. ఆ పార్టీ నాయకులు రైతులను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. రైతులతో రాజకీయం సరికాదని, ప్రజా క్షేత్రంలో రాజకీయం చేయాలని సూచించారు. మండలంలోని ర్యాలీ గఢ్‌పూర్ గ్రామానికి 1994 వరకు వ్యవసాయ రంగానికి కరెంట్ లేదని, ప్రస్తుతం 600 వరకు విద్యుత్ మోటర్లు నడిపించుకుంటూ రైతులు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. అన్నదాతల అభ్యున్నతికి పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీ కావాలా.., మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా ఆలోచించుకోవాలని రైతులకు సూచించారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి-రాజయ్య, ఎంపీపీ మందపెల్లి స్వర్ణలత-శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, ముల్కల్ల సర్పంచ్ మంచాల శ్రీనివాస్, కర్ణమామిడి సర్పంచ్ కొట్టె మహేందర్, పడ్తన్‌పల్లి సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గొల్ల శ్రీనివాస్, నాయకులు ఓలపు రమేశ్, బేర పోచయ్య, దర్ని శంకరయ్య, అలిశెట్టి కోటి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను తరిమికొడదాం..

దండేపల్లి, జూలై 20 : వ్యవసాయానికి మూడు గంటల కరెంటే చాలంటున్న కాంగ్రెస్‌ను రాష్ట్రం నుంచి తరిమిడదామని రైతులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు పిలుపునిచ్చారు. గూడెం రైతు వేదికలో నిర్వహించిన చర్చావేదికలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ పాతరోజులే వస్తాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిరంతర వెలుగులు అనే విషయాన్ని మర్చిపోవద్దని రైతులకు సూచించారు. రైతు సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న బీఆర్ఎస్ సర్కార్‌ను, సీఎం కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకొని చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి రాజకీయ సమాధి తప్పదు

- రేవంత్ రెడ్డి వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలి
- లేకపోతే తగిన బుద్ధి చెప్తారు
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

తిర్యాణి, జూన్ 20 : వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలన్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపన చెప్పాలని, లేకపోతే రాజకీయ సమాధి తప్పదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు హెచ్చరించారు. మండలంలోని గిన్నెధరి, తిర్యాణి రైతు వేదికల్లో గురువారం రైతులతో చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మార్చుతున్న తరుణంలో దీనిని ఓర్వలేని కాంగ్రెస్ నేతలు ఉచిత విద్యుత్ విషయంలో వ్యాపార ధోరణి అనుసరిస్తున్నారని విమర్శించారు. రైతులు ఆర్థికంగా ఎదగాలనే ధ్యేయంతో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. నాణ్యమైన విద్యుత్ సరాఫరా అయ్యేందుకు రూ.300 కోట్ల నిధులు వెచ్చించి, అభివృద్ధిని కొనసాగిస్తున్నారన్నారు. ఇది తెలువని కాంగ్రెస్ నాయకులు అనవసరమైన మాటలు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగాన్ని కించపర్చేలా మాట్లాడడం సరికాదని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంతరావు, మండలాధ్యక్షుడు కుర్సెంగ బాదిరావు, ఏదులపాడ్ సర్పంచ్ మడావి గోపాల్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు బొమ్మగోని శంకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముత్యం రాజయ్య, గాయెంగి మల్లేశ్, కిలిశెట్టి శంకరయ్య, బుర్ర మధూకర్, తిరుపతి, బ్రహ్మం, ఆయా గ్రామాల్లోని సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


రైతు వేదిక వద్ద తీర్మాన పత్రం చూపుతున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు

# సర్కారు బడుల్లో మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- జైనూర్ మండలంలో పలు ఆశ్రమ పాఠశాలలు తనిఖీ
- విద్యార్థులను ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టిన అధికారి

జైనూర్, జూలై 20 : సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని అధ్యాపకులకు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. జైనూర్, పోచంలొద్ది, రాశిమెట్ట, భూసిమెట్ట గిరిజన ఆశ్రమ పాఠశాలలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టోర్ రూంలో సరుకుల నిల్వల రికార్డులను పరిశీలించారు. మెనూ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరతి గదుల్లోకి వెళ్లి, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. హాజరు, ఉత్తీర్ణత శాతం, విద్య, అందిస్తున్న వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీవో మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉన్నతంగా చదివే విద్యార్థులకు ఐటీడీఏ తరపున ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. అనంతరం మండలంలోని ఉషేగాం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. హైరిస్క్ గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టిపెట్టాలని సిబ్బందికి సూచించారు. దవాఖానలో ప్రసూతి, తదితర వైద్య సేవలపై వైద్యుడు రాజుకు పలు సూచనలు ఇచ్చారు.


కెరమెరి : విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

## మోడి బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ..

కెరమెరి, జూలై 20 : మండలంలోని మోడి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి బోధనా తీరు, విద్యార్థుల కంప్యూటర్ పరిజ్ఞానం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థినులు పాఠ్యపుస్తకాలతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. గుణాత్మకమైన విద్య అందిస్తూ మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషిచేయాలని ఆదేశించారు. విధులపై నిర్లక్ష్యం వహించకుండా ఈ యేడాది మంచి ఫలితాలు సాధించేలా పట్టుదలతో కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కల్పించిన వసతులు, అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమంగా ఎదగాలని విద్యార్థినులకు సూచించారు. అలాగే మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. వ్యాక్సినేషన్ గదితో పాటు పరిసరాలను పరిశీలించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సకాలంలో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు రోగాల బారి పడకుండా తరచుగా గ్రామాల్లో పర్యటించాలన్నారు. దవాఖానలోనూ పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్, ఫార్మాసిస్ట్ ఖలీల్ హుస్సేనీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.